# లేత బుర్ర

సీతాపతి నిద్రపోతున్నాడు. బడికెదిగిన కొడుకు పలకా పుస్తకాలు ముందువేసుకున్నా పక్కనే కూచున్న చెల్లాయి ''కుక్క'' బొమ్మ మీదే దృష్టి నిలిపాడు. వాడా ఆనందాన్ని పూర్తిగా అనుభవించక ముందే సీత యింట్లోంచి యివతలి గదిలోకి వచ్చింది. రెండు నిమిషాలు ఓపిక పట్టి చూచింది. కొడుకు ధ్యాస మళ్ళించేట్టు లేడు. ''చదువుకోరా నాయనా! ఎట్లా బాగుపడతావురా చదువుకోకపోతేనూ?'' అన్నది. అంటూనే కూతుర్ని యెత్తుకుని యింట్లోకెళ్ళి పోయింది.

సీతాపతి నిద్రపోతూనే వున్నాడు. కొడుకు మాత్రం మళ్ళీ పుస్తకం మీదకి ధ్యాస మళ్ళించాడు గాని తల్లి అన్నమాట వాడికి అర్థంకాక ఆలోచనలో పడ్డాడు. ''చదువుకోకపోతే బాగుపడటం యెల్లాగురా'' అన్నదావిడ. ఈ బాగుపడటం అంటే యేమిటో వాడికర్థం కాదు. ఆవిడ నోటి మీదుగా ఇదేమాట అనేకసార్లు వింటుంటాడు కాని దీనికి అర్థం తెలియదు. తను ఎప్పుడైనా అల్లరిలాంటిది చేస్తున్నట్టు తోస్తే తల్లి ''బాగుపడేలక్షణాలు'' అంటుంది. ఆ మాటలో వ్యంగ్యం కుర్రవాడికి అర్థంకాదు. కాని అసలు సంగతీ తెలీదు కనక ప్రమాదం లేదు. ''బాగు'' అనే మాటకి అర్థంకోసం వాడి లేత మనస్సు తపనపడి పోతూన్నది. ఏదైనా వస్తువుని చూచినప్పుడుఅనే ''బాగున్నది'' అనేమాట – మనుషుల మీదా మనుషుల చర్యలమీదా ప్రయోగిస్తే మరి వాడికర్థంకాదు. వాడికెటూ అర్థం కాదు గ దా అని ఆ తల్లి అనటమూ మానెయ్యదు. ఆ మాటకి అర్థం తల్లినే అడిగితే యేం మూడునో అని కుర్రవాడికి భయం. పోతే తండ్రిని అడుగుదామంటే సీతాపతి యెప్పుడూ ఇంట్లో నిద్రపోతూనే వుంటాడు, నిద్రపోని సమయాలలో ఇంట

ఉండదు. ఇంటి సంగతలు యేదీ అతనికి పట్టనట్టు దూర దూరంగా వుంటాడు. దేన్ని గురించీ సీతాపతి 'రిమార్కు' చెయ్యటం యీ కొడుకు యెరగడు, కుర్రవాడి ఆలోచనలకి పొట్టుండదు. అసలు వాడు యేమీ ఆలోచించకండా, చదువుకున్నంతసేపూ పాఠాలేవో చదువుకుని మిగతా కాలంలో ఓమూల కూచుందామని యెప్పుడూ నిశ్చయించు కుంటూనే వుంటాడు. కాని తీరా పుస్తకాలముందు కూచున్న వాడికి యి దే ఆలోచన తగుల్తుంది. ''బాగుపడటం అంటే యేమిటి?'' అని. వాడి ఆలోచన తెగదు. కాలం నడిచి పోతూనే వుంటుంది. సీతాపతి నిద్రపోతూనే ఉంటాడు. ❋

*(తెలుగు స్వతంత్ర)*